క్లుప్తంగా

నేటి నుంచి ఉసేన్ సాహెబ్ ఉర్సు

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామంలో వెలసిన ఉసేన్‌సాహెబ్ తాత ఉర్సు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. వేడుకలకు సంబంధించి కరపత్రాలను నిర్వాహకులు విడుదల చేశారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తాతగారి ఆశీస్సులు పొందాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మండల కేంద్రంలో టౌన్ త్రీ ఫీడర్ ఏర్పాటు చేసేందుకు స్థానిక టీచర్స్ కాలనీ, భరత్‌నగర్, కొత్త బస్టాండ్, నరసింహ కాలనీ, తెలంగాణ చౌరస్తా, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, మైలోనిగడ్డ, కాలనీలకు ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా వెంకటాపురం, యాపదిన్నె, గుడుదొడ్డి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దారి ఏర్పాటు చేయాలి



మానవపాడు: పంట పొలాలకు దారి ఏర్పాటు చేయాలని చెన్నిపాడు, పెద్దపోతులపాడు గ్రామాల రైతులు పేర్కొన్నారు. మండలంలోని చెన్నిపాడు నుంచి పెద్దపోతులపాడు మధ్యన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద రైతులు శనివారం ఆందోళన తెలిపారు. పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా అధికారులు బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

కార్మికుల అరెస్టు అక్రమం

గద్వాల: తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కార్మికులను అరెస్టు చేయడం అక్రమమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ అన్నారు. చలో హైదరాబాద్‌కు వెళ్లిన కార్మికుల అరెస్టులను నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఘట్టన్న, కన్వీనర్ రాజేష్, హరికృష్ణ, శేఖర్, పార్వతమ్మలు తదితరులు పాల్గొన్నారు.

శాలివాహన చక్రవర్తి జయంతి



అయిజ: మండలంలోని సింధనూరు గ్రామంలో శనివారం శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విక్రమాదిత్యుడిని ఓడించి, శాలివాహన శకం ప్రారంభించి, అఖండ భారతాన్ని ఏర్పాటు చేసిన ఘనత శాలివాహన చక్రవర్తికే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

అయిజ: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు యత్నించిన బీఆర్ఎస్ నాయకులను శనివారం తెల్లవారుజామున పోలీసులు స్థానిక స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, వీరేష్, రమేష్ బాబు, రాజు ఉన్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు



అయిజ: మండలంలోని యాపదిన్నె గ్రామంలో శనివారం పంచాయతీ కార్యదర్శి శ్వేత చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వివేకానంద కాలనీలో ఎంపీడీఓ తిరుపతన్న చలివేంద్ర కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఉపాధి పని పరిశీలించి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బాషా, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టదా..?

- కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు
- ముళ్లపొదలతో మూసుకుపోయిన అంతర్రాష్ట్ర రహదారి
- అధికారులపై ప్రయాణికుల ఆగ్రహం



జూలెకల్ సమీపంలో ఇరుకుగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారి

శాంతినగర్: అంతర్రాష్ట్ర రహదారికి ఇరువైపుల ముళ్లపొదలు పెరిగి వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్న కనీస చర్యలు చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు.

నిత్యం వాహనాల రద్దీ..

అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ వరకు ఉన్న 42 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ డబుల్ లైన్ల రహదారి



జూలెకల్ సమీపంలో వాహనం ఢీకొట్టడంతో కూలిన కల్వర్టు రక్షణ గోడ

ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు వెళ్తుంటారు. అంతేగాక కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు కావడంతో భారీ వాహనాలు సైతం ఇదే రహదారిపై వెళ్తుంటాయి. వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారి సౌకర్యంగా లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వడ్డేపల్లి, అయిజ మండలాల పరిధిలో గత రెండేళ్లుగా సుమారు ఆరుగురు ప్రమాదాల బారిన పడి మృతి చెందారు. కొందరు కాళ్లు చేతులు విరిగి ఆస్పత్రుల పాలయ్యారు.

ప్రమాదాలకు నిలయంగా కల్వర్టులు

అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ వరకు ఉన్న రహదారిలో శాంతినగర్– వెంకటాపురం మధ్యన ఉన్న ఆరు కల్వర్టుల వద్ద ఇరుకుగా ఉండటం, రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. శాంతినగర్ నుంచి వెంకటాపురం మధ్యలో వాగులపై గతంలో ఉన్న సింగిల్ రోడ్డుకు అనుగుణంగా నిర్మించిన కల్వర్టుల స్థానంలో డబుల్ లైన్‌కు అనుగుణంగా కొత్తగా కల్వర్టులు నిర్మించలేదు. దీంతో కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే భయంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు.

పత్తాలేని సూచికబోర్డులు..

కల్వర్టుల వద్ద ముళ్ల పొదలతో మూసుకుపోవడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. వాహనాలు ఎదురుగా వచ్చిన సమయంలో రోడ్డు చివరికి వెళ్లడం కల్వర్టు గోడలను ఢీకొట్టిన సంఘటనలు అనేకం. కర్నాటకకు చెందిన ఓ వ్యక్తి జూలెకల్ సమీపంలోని కల్వర్టు గోడను ఢీకొట్టి వాగులో పడి మృతి చెందాడు.

కల్వర్టు గోడలు కనిపించవు



వాగులపై గతంలో నిర్మించిన చిన్నపాటి కల్వర్టులు ఉన్నాయి. ముళ్లపొదలు పెరగడంతో రక్షణ గోడలు కనిపించడం లేదు. మోటార్‌సైకిళ్లపై వస్తున్న సమయంలో భారీ వాహనాల వెలుతురు వల్ల కల్వర్టుల వద్ద ఇటీవల ముగ్గురు ప్రయాణికులు మృతిచెందారు.

– పెద్ద భీమన్న, కుర్వపల్లి

సూచిక బోర్డులు లేవు



శాంతినగర్ నుంచి జూలెకల్ స్టేజి వరకు కల్వర్టుల వద్ద వరకు ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు ఢీకొంటున్నాయి. కనీసం రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చిన్న వెంకటేష్, జక్కిరెడ్డిపల్లి

ప్రతిపాదనలు పంపాం

రాయచూర్ ప్రధాన రహదారిలో శాంతినగర్ నుంచి అయిజ వరకు ఉన్న 6 కల్వర్టులు పెద్దవిగా నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. రహదారిపై సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తాం. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో వాహనాల రద్దీ కూడా అధికంగా ఉంటుంది. నిధులు మంజూరైన వెంటనే నూతన కల్వర్టులు నిర్మించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వరి జేఈ, ఆర్అండ్‌బీ శాఖ

ఉన్నత లక్ష్యాలు సాధించాలి



పాతపాలెం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కవితాదేవి

కేటీదొడ్డి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని న్యాయ విజ్ఞాన సదస్సు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితాదేవి అన్నారు. శనివారం మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, వార్షిక పరీక్షల్లో ప్రైవేటు దీటుగా ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. బాల కార్మిక చట్టాలు, బాల్య వివాహాలు, చైల్డ్ అబ్యూస్ చట్టాలపై అవగాహన ఉండాలననారు. అనంతరం మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయుల, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎవరి జాబ్‌కార్డుపై వారే పనిచేయాలి



బల్గెరలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నయ్య

గట్టు: ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పని చేయడం నేరమని ఎంపీడీఓ చెన్నయ్య కూలీలకు సూచించారు. శనివారం బల్గెర గ్రామంలో రోడ్డు ఫార్మేషన్ పనులను అధికారులు పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలతో అధికారులు మాట్లాడారు. ఉపాధిలో కూలీ గిట్టుబాటు కావాలంటే తప్పని సరిగా 5 ఫీట్ల వెడల్పు, పొడవు, ఫీట్ల లోతు మట్టిని తీసి, రోడ్డుపైకి వేస్తేనే రోజుకు రూ. 300 కూలి లభిస్తుందని తెలిపారు. జాబ్ కార్డుతో పాటుగా బ్యాంకు ఖాతా కలిగి ఉండి, కేవైసీ చేయించుకున్న కూలీలు మాత్రమే పనికి రావాలని సూచించారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు ఎంపీడీఓ అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ స్వామి, టీఏ దర్శనం, మేట్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



ఉపాధి కూలీలతో ఎంపీడీఓ కృష్ణమోహన్

కేటీదొడ్డి: బాలల హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ ఆధ్వర్యంలోని శనివారం మండలంలోని కొండాపురం గ్రామంలో వీసీపీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, బాలల హక్కులపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కేసు వర్కర్ నవీన్, సోషల్ వర్కర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు రాయితీపై పరికరాలు

గట్టు: వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్నట్లు వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి గాను వ్యవసాయ యాంత్రీకరణపై ఉప- మిషన్ పథకం ద్వారా 50 శాతం రాయితీపై పనిముట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. రూ. 2.72 లక్షలతో 20 యూనిట్లను మండల మహిళా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్–7, రోటోవేటర్లు–3, తైవాయన్ స్ప్రేయర్లు–7, కల్టివేటర్, ఎంబీప్లగ్, కేజీవీల్స్–3 ఉన్నట్లు తెలిపారు. అర్హులైన మహిళా రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు

అలంపూర్: వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి నాగార్జున్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 2024– 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా రైతులకు ఉప మిషన్(ఎస్ఎంఏఎం) పథకం కింద నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. మహిళా రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు రూ. 2.06 లక్షలతో 15 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముళ్ల పొదలు తొలగించండి



వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ప్రజలు

అయిజ: పట్టణంలోని పెద్దవాగులో ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయని వాటిని తొలగించాలని స్థానిక ప్రజలు కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి మాట్లాడుతూ.. వాగులో ముళ్లపొదలు దట్టంగా వ్యాపించడంతో వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు వాగు ప్రాంతంలో నివాసముంటున్న వారి ఇళ్లలోకి వరదనీరు వస్తుందన్నారు. అధికారులు వేసవిలో ముళ్లపొదలు తొలగించాలని కోరారు.

నీటి వృథాను అరికడదాం




గట్టు: నీటి వృథాను ప్రతి ఒక్కరు అరికట్టాలని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. వృథాగా పారుతున్న వర్షపు నీటిని భూమిలోకి ఇంకే విధంగా చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. శనివారం ఇందువాసి గ్రామంలో భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ సహకారంతో రూ. 4.15 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాంను అధికారులు ప్రారంభించారు. అదే విధంగా పెంచికలపాడు గ్రామంలో చెక్ డ్యాంను రైతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ స్వామి, కార్యదర్శి శేఖర్, జీవనోపాధి అధికారి వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ షణ్ముక తదితరులు పాల్గొన్నారు.

స్థల విక్రయదారులపై చర్య తీసుకోవాలి

గట్టు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పది శాతం స్థలాన్ని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు రామకృష్ణారెడ్డి, బజారి, కృష్ణ, రంగస్వామి శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 302లో 4 ఎకరాల స్థలాన్ని గతంలో ప్రభుత్వం సేకరించి, ప్లాట్లుగా మార్చి పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సర్వే నంబర్‌లో బీసీ కాలనీలో ఖాళీగా వదిలిన పది శాతం స్థలాన్ని తెలుగు వెంకటేష్ అనే వ్యక్తి తన భార్య పేరున అక్రమంగా రిజిస్ట్రార్ చేయించుకుని, వేరే వ్యక్తికి విక్రయించినట్లు ఫిర్యాదు చేశారు. పది శాతం స్థలం వ్యవహారంపై విచారణ జరిపి ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

‘అలంపూర్ అభివృద్ధికి నిధులివ్వండి’



అలంపూర్: అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వాలని ఎమ్మెల్యే విజయుడు కోరారు. అసెంబ్లీలో అలంపూర్ సమస్యలను ఎమ్మెల్యే విజయుడు శనివారం ప్రస్తావించినట్లు తెలిపారు. ప్రధానంగా రాష్ట్రంలో ఉన్న ఏకైక శక్తిపీఠం అలంపూర్ నియోజకవర్గంలో ఉందని, అలంపూర్ క్షేత్ర అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరినట్లు తెలిపారు. కర్నూల్‌లో ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డుల ద్వార వైద్యం పొందే అవకాశం కల్పించాలని అదే నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

ఇటిక్యాల: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని మోటివేషనల్ స్పీకర్ మేడికొండ ఈశ్వర్, సీడీఓ రామాంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల వార్షికోత్సవంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సేవాగుణంతో మెలిగి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. పిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. అనంతరం అతిథులను ఉపాధ్యాయ బృందం శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల్లో జగద్గురు పూజలు



ఆలయం వద్ద శ్రీమద్ శ్రీశైలం జగద్గురువు

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలను శ్రీమద్ శ్రీశైలం జగద్గురు శ్రీశ్రీశ్రీ 100 చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్తలు వారికి స్వాగతం పలికారు. అదే విధంగా ఇడుపునూరు శ్రీమఠం పీఠాధిపతి శ్రీ మంజునాథస్వామి అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వనాథ రెడ్డి, జయరాముడు, ఏ.వెంకటేశ్వర్లు, గోపాల్, సురేంద్ర స్వామి, వెంకటేశ్వర్లు, పులేందర్, ఆలయ అధికారులు చంద్రయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కూలి రూ.600 చెల్లించాలి

అలంపూర్ రూరల్: ఉపాధి హామీ కూలీలకు పని వద్ద కొలతలతో సంబంధం లేకుండా దినసరి కూలి రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు అన్నారు. మండల పరిధిలోని భైరంపల్లీ, గొందిమల్ల గ్రామాల్లో శనివారం ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. జిల్లాలో టెక్నికల్ అసిస్టెంట్లు కొలతల పేరుతో వంద రూపాయాల లోపే కూలీ ఇస్తున్నారన్నారు. గొందిమల్ల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారని 89 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఇద్దరు మాత్రమే బేస్మెంట్ లెవల్ కట్టారని అధికారుల అనుమతులు లేకపోవడంతో లబ్ధిదారులు కట్టడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జయన్న, నర్సింహ, అయ్యప్ప, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవాలి



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అయిజ: ప్రతి ఒక్కరూ నీటివనరులను కాపాడాలని ఎంఈఓ రాములు అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌సీసీ అధికారి లక్ష్మన్న ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. భూగర్భ జలాలు పెంపొందిచుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, తిమ్మప్ప, పరుశరాముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు



గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. రెండో రోజు హిందీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

★ అలంపూర్ పట్టణంలోని పరీక్షా కేంద్రాల్లో 3006 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 3005 మంది హాజరయ్యారు. ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు.

★ అయిజ మండల కేంద్రంలో ఐదు పరీక్ష కేంద్రాలు, మండలంలోని ఉత్తనూరులోని పరీక్ష కేంద్రంలో 999 మంది విద్యార్థులకు గాను 8 మంది విద్యార్థులు హిందీ పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

★ మానవపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షకు 296 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

★ ఇటిక్యాల మండల కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు వందశాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

★ ఎర్రవల్లి మండల వ్యాప్తంగా రెండో రోజు పదో తరగది పరీక్షకు 409 మంది విద్యార్థులు హాజరవ్వగా ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి అమీర్‌పాషా తెలిపారు.

★ ఉండవెల్లి మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో హిందీ పరీక్షకు 406 మంది విద్యార్థులు హాజరైనట్లు కార్ కాస్టోడియన్ అశోక్ తెలిపారు.

★ మల్దకల్ మండలంలోని జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో రెండో రోజు పదో తరగతి పరీక్షకు 478 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు భాస్కర్‌పాపన్న, సుదర్శన్‌రెడ్డి, నర్సింహరెడ్డి తెలిపారు.

★ గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, మాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 495 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ నల్లారెడ్డి తెలిపారు.



ఇటిక్యాలలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



ఉండవెల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

దళితవాడలో ప్రభుత్వ భూమిని సర్వే చేయండి



వినతిపత్రాన్ని అందిస్తున్న కేవీపీఎస్ నాయకులు

అమరచింత: పట్టణంలోని దళితవాడలోని సర్వేనంబర్ 506లో గల ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి వాటిని కాపాడుకునేలా కంచెను ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ.శ్యాంసుందర్, అజయ్‌లు మాట్లాడారు. పట్టణంలోని 5వ వార్డులో సర్వే నంబర్ 506లో 1382లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 9.12 గుంటల భూమిని ఇచ్చారన్నారు. ఇదే కాలనీలో ఓ వ్యకి పట్టా భూమి అని చెప్పి 1.3 గుంటలు కొనుగోలు చేసి వెంచర్ ఏర్పాటు చేశారని, ఆ స్థలం పట్టా భూమి ఎక్కడిదనే అభ్యంతరాలతో అనుమానాలు వ్యక్తం చేస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. తహసీల్దార్ చొరవ చూపి సర్వే నంబర్ 506లో 1.3 గుంటల స్థలం ఎక్కడిదో సర్వే చేసి ఘర్షణలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం

శాంతినగర్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కర్నాటక రాష్ట్రం నుంచి పాదయాత్రగా శ్రీశైల క్షేత్రానికి వెళ్తున్న భక్తులకు వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ స్టేజి, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అంతేగాక పండ్లు, విభూతి, మహిళలకు కుంకుమ, గాజులు అందజేసి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ముచ్చుమర్రి భాస్కర్‌రావు, ప్రమీల, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.